తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అప్పలాయగుంటలో వైభవంగా గ్రామోత్సవం

వడమాలపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊయాలలో కొలువుదీర్చిగా స్వామివారు గంటపాటు సిద్విలాసంగా ఊయలలుగుతూ భక్తులకు దర్శనమి చ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడవీధుల్లో విహరించారు. ఆలయ అధికారి వేణుగోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, షరాబ్ రవీంద్ర, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగా కుమార్ ఆగమోక్తంగా అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా పడికావలి వద్ద సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు ఆలయ అర్చకులు దిక్కు నుండి పుట్టమన్ను సేకరించి, స్వామి వారి సేనాధిపతి విష్వక్సేనుల వారి ఎదుట సుగంధద్రవ్యాలతో పూజించి, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు.



### ప్రశ్నార్థకంగా

## జాతీయ గ్రామీణ ఉపాధి పథకం

### - రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి



రచ్చబండ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వలన ప్రశ్నార్థకంగా మారిందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కోటపోలూరులో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గురువంబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించి ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన గ్రామీణ పేదల వలసలను అరికట్టేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధుల భారాన్ని ఈ పథకానికి సంబంధించి రాష్ట్రాలపై మోపుతుందని తెలిపారు. అప్పట్లో వందశాతం కేంద్రప్రభుత్వమే భరించేదన్నారు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రానికి 5 వేల కోట్లు అదనపు భారం 40 శాతం కేటాయించడం వలన పడుతుందని షర్మిలారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉపాధి కార్డులు తొలగించారని, దీంతో పథకం లక్ష్యం నెరవేరకుండానే నిర్వీర్యమైపోతుందని చెప్పారు. జగన్, చంద్రబాబు 11 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్లలో రాయలసీమకు నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన లేకుండానే పరిపాలన చేశారని అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఎన్‌జిటి వద్ద బలమైన వాదనలు రాష్ట్రం తరపున చేయకపోవడం వల్లనే ప్రస్తుతం ఈ పరిస్థితి నెలకొందని ఆమె చెప్పారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలో బెల్టుషాపుల పుణ్యమా అని మద్యం డోర్ డెలివరీ జరుగుతుందని విమర్శించారు. ప్రభుత్వ పథకాలు అంతంతమాత్రంగానే అమలవుతూ సంక్షేమం పేద ప్రజల దరికి చేరడం లేదని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని షర్మిలారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.వెంకటాచలపతి, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు మహ్మద్ నజీర్, సునీల్‌రెడ్డి, మస్తాన్‌వలి, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### “మాఢ” వీధులకు భక్తాగ్రేసరుల పేర్లపై

## ముహూర్తం ఎప్పుడో!?

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

లక్షలాదిమంది భక్తుల ఇలవేల్పు...ఏడుకొండల వేంకటేశ్వరుడు కొలువైన ఆలయం చుట్టూ ఉన్న మాఢవీధులు ఎంతో పవిత్రమైనవి. ఈ వీధులకున్న ప్రాశస్త్యంతో భక్తాగ్రేసరుల పేర్లు పెట్టాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఇందుకు ఓ కమిటీ కూడా ఏర్పాటైంది. ఆ కమిటీలో సభ్యులు ఆయా మాఢవీధులకు ఉన్న ప్రాశస్త్యం...భక్తాగ్రేసరులతో ఉన్న అనుబంధం గుర్తించి మాఢవీధులకు నలుగురు భక్తాగ్రేసరుల పేర్లు సూచించనున్నారు. ఇప్పటికే తిరుమలలో అతిథిగృహాలు, విశ్రాంతి భవనాలకు పూర్తిగా భక్తిభావం కలిగేలా పేర్లు వెలిశాయి. ఈ పేర్లు అన్నీ కూడా భక్తుల్లో మరింత భక్తిభావాన్ని చాటేలా చూస్తున్నారు. నాలుగుమాఢవీధుల్లో ఒక వీధికి వెంగమాంబపేరు, మరోవీధికి అన్నమయ్యవీధిగా, మరోవీధికి అనంతాళ్వారు ,చివరగా రామానుజుల పేర్లుతో ఇలా నామకరణం చేయాలనేది భక్తుల నుండి కూడా అభిప్రాయం. ఆలయానికి చుట్టూ అర్చకులు నివసించే ఇళ్ళున్న వీధులను పవిత్రంగా భావించి తమిళంలో “మాడాం”అని పిలిచారు. ఒకప్పుడు తిరుమల ఆలయం చుట్టూ స్వామివారు వాహనంలో ఊరేగడానికి సరియైన వీధులు లేవు. శ్రీరామానుజులు దేవాలయం చుట్టూ వీధులను ఏర్పాటుచేయించి స్వామివారు వీధుల్లో ఊరేగేందుకు చూశారనేది పురాణాల కథనం. ఆలయం చుట్టూ నాలుగుమాఢవీధులు నాలుగు వేదాలకు ప్రతీకలు. మాఢవీధుల్లో భక్తులు ,టిటిడి అధికారులు ,సిబ్బంది ఒక్కరేమిటీ అందరూ పూర్తిగా పాదరక్షలు లేకుండా కనిపిస్తారు. ఆలయానికి తూర్పుముఖంగా ఉన్నదే తూర్పుమాఢవీధి. ఇదే సన్నిధివీధి. దక్షిణమాఢవీధిలోనే తిరుమలనంబి గుడిఉంది. దీనిపక్కనే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుండి గుడికి చేరే వంతెన క్రిందే ఒకప్పుడు గుర్రాలపాక ఉండేదట. ఇక ఆలయానికి వెనుకవైపు ఉన్నదే పడమరమాఢవీధి. ఒకప్పుడు ఎన్నో మఠాలు,సత్రాలు ఉండేవి. ఉత్తరమాఢవీధిలో ఉత్తరాధిమఠం, తిరుమలనంబి తోళప్పు కైంకర్యనిలయం, అహోబిలమఠం శ్రీవైఖానస అర్చక నిలయం ఉన్నాయి. ఈ వీధిలోనే తాళ్ళపాక వారి ఇల్లుఉండేది.



## ప్రాణ రక్షణకు హెల్మెట్ ఆధారం : ఎస్పీ

రైల్వే కోడూరు, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త)



సమాజంలోని ప్రతి యువకుడు తప్పనిసరిగా వాహనంలో వెళ్లేముందు హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ చేసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. శనివారం రైల్వేకోడూరు పట్టణంలోని టోల్గేట్ వద్ద ఐదు మండలాలకు చెందిన విలేకరులకు, పోలీసులకు అమర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ కోడూరు నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులు అప్రమత్తంగా హెల్మెట్ ధరించి వాహనాలలో ప్రయాణించాలని, అప్పుడు వారి కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా గడపగలరని. ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్న తరుణంలో పూర్తిస్థాయిలో హెల్మెట్లను వాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వాహన దారుడికి ఉంది అని అన్నారు. అమర్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనందకుమార్ మాట్లాడుతూ ప్రమాదాలను నివారించేందుకు అమర హాస్పిటల్ తిరుపతి ప్రాంతంలోనూ కోడూరు ప్రాంతంలోనూ వాహనదారులకు ఉచితంగా దాదాపు 200 హెల్మెట్లను అందజేస్తున్నదన్నారు. హెల్మెట్లపై అవగాహన కలిగించే విధంగా అమర హాస్పిటల్ సంకల్పించిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డిఎస్పి శ్రీనివాసులు, కోడూరు సిఐలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తోపాటు రైల్వే కోడూరుకు డిసి ఎమ్మెస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, టిడిపి యువ నాయకులు ముక్క సాయి వికాస్ రెడ్డి, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, మంగంపేట నాయకులు తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, నార్జాల హేమ్రాజ్, పోతురాజు నవీన్, ఉంగరాల బ్రదర్స్, డి కృష్ణంరాజు, పందేటి వెంకటరామరాజు, మైనారిటీ నాయకురాలు ముంతాజ్ మెహతాజ్ బేగం, విక్టరీ హైస్కూల్ కరస్పాండెంట్ నరసింహారెడ్డి, వశిష్ఠ డిగ్రీ కళాశాల అధినేత నారాయణ వర్మ తో పాటు రైల్వే కోడూరు చెందిన ప్రజానీకం పాల్గొన్నారు.

### పాలనపై “పట్టు”దిశగా

## ముద్దాడ అడుగులు

### -తొలిరోజే కొండపై సుడిగాలి పర్యటనలు

### -అన్నదానంలో భక్తుడిగా మాటామంతీ



తిరుమల, పిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడిలో ముఖ్యంగా తిరుమలపై “పట్టు”కలిగి ఉండేందుకు నూతన ఈఓ ముద్దాడ రవిచంద్ర వ్యూహాత్మకంగా అడుగులేసేలా ఉన్నారు. ఇందులో భాగంగా ఆయన బాధ్యతలు చేపట్టిన మరుసటిరోజే శనివారం సాయంత్రం భక్తులు రద్దీగా ఉండే వెలుపల క్యూలైన్ల ప్రాంతాలను,అన్నదానం భవనంలో భక్తులు స్వీకరించే విధానం, రుచినాణ్యతపై భక్తులను పలకరించి వివరాలు రాబట్టడం చేశారు. యాత్రికుల వసతి సముదాయాల్లో సౌకర్యాలపై తెలుసుకుని అక్కడ అమలుచేయాల్సిన మార్పులపై తనదైన రీతిలో అధ్యయనం చేశారు. ఆయన శనివారం సాయంత్రం రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్‌తో కలసి అన్నదానం భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈఓ ముద్దాడతోబాటు అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ,అన్నదానం అధికారులు ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం మరింత సదుపాయాలు, వేగంగా దర్శనం పై అధ్యయనం చేస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికల యుద్ధంకు సిద్ధం

### - ఎలక్షన్ కమీషన్ కీలక నోటిఫికేషన్ జారీ



చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమీషన్ సిద్ధం అవుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమీషన్ శనివారం కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు గ్రామ పంచాయతీల్లో వార్డు వారీగా ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా తయారు చేయాలని ఎలక్షన్ కమీషన్ జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఓటరు జాబితాలను అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల జాబితా ఆధారంగా తీసుకుని సిద్ధం చేయాలని ఎలక్షన్ కమీషన్ స్పష్టం చేసింది. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్లను 1 జనవరి 2026 నాటికి ఓటరు అర్హత తేదీగా పరిగణించాలని పేర్కొంది. ఇలా సిద్ధం చేసిన ఓటరు జాబితాలను 9 మార్చి 2026న ప్రచురించనున్నారు. రాష్ట్రంలో మార్చి నెలాఖరు నాటికి పంచాయతీ పాలకవర్గాల గడువు తీరనుంది. గడువు తీరిన వెంటనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమీషన్ సిద్ధంగా వున్నట్లు స్పష్టం అవుతుంది. ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణలకు సంబంధించి ఎలక్షన్ కమీషన్ త్వరలోనే వివరమైన మార్గదర్శకాలను విడుదల చేయనుంది. అయితే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తయిన వెంటనే నిర్వహించడానికి సిద్ధ పడుతుందా! లేక కొన్ని నెలల పాటు వాయిదా వేసి ఆ తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించడాని పూనుకుంటుందా! అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో ఎలక్షన్ కమీషన్ మాత్రం పంచాయతీ పాలకవర్గాలకు గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించి పంచాయతీలకు నూతన పాలకవర్గాల ఎన్నికలకు కసరత్తు ముమ్మరంగా చేస్తోంది.

## యూనివర్సిటీలు సామాజిక ప్రయోగశాలలు.

### ఎస్వీయూలో ఘనంగా ప్రారంభమైన న్యాయోత్సవ్ 2026

తిరుపతి విద్య ఫిబ్రవరి 7 ప్రభాత వార్త




విశ్వవిద్యాలయాలు సామాజిక ప్రయోగశాలలు, విజ్ఞాన సంపదను సృష్టించే నిల యాలని అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా ఆర్ వెంకటరమణి పేర్కొన్నారు. ఎస్వీ యూ న్యాయ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న న్యాయోత్సవ్ 2026 సమావేశాలు శనివారం వర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి న్యాయోత్సవ్ సమావేశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో సామాజిక ప్రయోగశాలలని,విద్య సమూపార్జనలో ప్రతిఫలం ప్రాధాన మైందని అభిప్రాయపడ్డారు. పౌరనీతి అధ్యయనంతో మానవజీవితాలకు సరైన న్యాయం, నియంత్రణ కలుగుతుందన్నారు. న్యాయ విద్యార్థులు నీరసించిన వ్యక్తిత్వంతో వుండకూడదని, చలాకీ, ఉత్సాహం తొనికిసలాడాలని పిలుపునిచ్చారు. మన ప్రాచీనతను వదులుకోకూడదని, స్వాతంత్ర్య సమరయోధులను మరువకూడదని, సామాజిక విభాగాలను గుర్తించి, వారికి రాజ్యాంగం ప్రకారం సమానత్వ అవకాశాలు కల్పించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సంరక్షించాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో సంక్లిష్టతలను అర్ధంచేసుకోవలని, హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలన్నారు. సమకాలీన విధానాలు యంత్రాలతో పని చేస్తున్నాయని, కృత్రిమ మేధస్సుతో మనం చూడని అంశాలను చూస్తున్నామని, అవిమనలను హైజాక్ చేస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ఏపీ హైకోర్ట్ అడిషనల్ జడ్జి అవధానం హరిహరనాథశర్మ మాట్లాడుతూ స్టూడెంట్స్ ఆఫ్ లా, లా స్టూడెంట్స్ పదాల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. నేటి న్యాయ వ్యవస్థ ముందున్న సవాళ్లు, పరిష్కారాలపై విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసా ఆచార్య సూర్యప్రకాష్ రావు, ఎస్వీయూ వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, కార్యక్రమ సమన్వయ కర్త ఇంచార్జి డీన్ ఆచార్య భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, లా విద్యార్థులు పెద్ద

## తిరుపతిరూరల్లో గంజాయి అమ్మకాలు...

### 3.5కిలోల గంజాయి స్వాధీనం

### -గంజాయి విక్రయించే ఒడిషా వ్యక్తి అరెస్ట్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి07 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన వ్యక్తిని శనివారం తిరుపతిరూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనపై ప్రత్యేక చర్యలు చేపట్టిన తిరుపతిరూరల్ ఇన్‌స్పెక్టర్ చిన్నగోవింద్ ఆధ్వర్యంలో ఉప్పరపల్లి పాత వాటర్ ట్యాంక్ సమీపంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతని దగ్గర ఉన్న 3.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వ్యక్తి పేరు దుర్యోధన్‌రెడ్డిని అతనిది ఒడిషా రాష్ట్రమని తెలిపారు. నేరానికి ఉపయోగించిన హీరో ఫ్యాషన్ మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్ కూడా స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గత నాలుగేళ్ళుగా తిరుపతిలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ, ఒడిషా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు విచారణ తెలినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని, రిమాండ్‌కు తరలించి, కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ. చిన్న గోవింద్ తెలిపారు

## నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ప్లానింగ్ కార్యదర్శులు సస్పెన్షన్

### -నగరపాలక కమిషనర్ మౌర్య

తిరుపతి,పిబ్రవరి 7ప్రభాతవార్త:



తిరుపతి నగరపాలక పరిధిలో ఆగస్ట్ 31 తరువాత జరుగుతున్న భవనాల నిర్మాణాలపై శాటిలైట్ నిఘా ఉంచామని నగరపాలకసంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరంలో అనధికారిక నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆమె డిసిపి ఖాన్, ఏసిపిలు పార్వతిప్రియ, మూర్తితో కలసి సమీక్షించారు. గత ఏడాది ఆగస్ట్31కి ముందు నగరంలో జరిగిన అనధికారిక భవన నిర్మాణాలను బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, అనుమతులు లేకుండా నగరంలో భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలుతీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగి ఉంటే బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. అనధికారిక నిర్మాణాలపై అశ్రద్ధ వహించిన ఇద్దరు ప్లానింగ్ కార్యదర్శులను సస్పెండ్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇప్పటివరకు 1,033 బిపిఎస్ దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

## కేంద్రమంత్రికి శివరాత్రి ఆహ్వానం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కేంద్ర మంత్రులకు ఆహ్వాన పత్రికలను శనివారం అందించారు.ఈ నేపథ్యంలో కేంద్రభారీ ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి భూపతి శ్రీనివాస్‌వర్మను కలసి ఆహ్వాన పత్రికలను అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు బ్రహ్మోత్సవాలుగా శివరాత్రిని నిర్వహించటం ఆనవాయితి అని వివరించారు. తప్పక రావాలని ఆహ్వాన పత్రికలను అందించారు.ఆనంద్‌తో పాటు మాజీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు చంద్రప్ప చందు,అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర సరిహద్దులు కట్టు దిట్టం

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :

తమిళనాడు శాసనసభ ఎన్నికలు 2026 నేపథ్యంలో అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించబడింది. తిరువళ్లూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు.. యం. ప్రతాప్ నిర్వహించగా, తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి, తిరుపతి, జిల్లా ఎస్పీ, జిల్లా రెవెన్యూ అధికారి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో తల్లి, ఇద్దరు ఆడపిల్లల ఆత్మహత్య

పుత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా ఒక తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కృష్ణానగర్‌లో శనివారం సాయంత్రం జరిగింది. తల్లి పద్మ (28) తన ఇద్దరు ఆడపిల్లలతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పైడిపల్లికి చెందిన ఇ.శివశంకర్, నేసనూరుకు చెందిన పద్మ ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదివేటపుడు ప్రేమించుకున్నారు. 2019లో ఇంట్లో వాళ్లను కాదని ప్రేమ వివాహం చేసుకున్నారు. నాలుగు నెలల క్రితం నేసనూరు నుంచి వచ్చి పట్టణంలోని కృష్ణానగర్‌లో ఒక ఇంట్లో మూడో అంతస్తులో నివశిస్తున్నారు. వీరికి తేజ (7), లాస్య (5) అనే ఇద్దరు ఆడపిల్లలున్నారు. స్థానిక వివేకానంద స్కూల్లో పిల్లలు ఒకటో తరగతి, యుకెజి చదువుతున్నారు. చాలా కాలంగా శివ ఏ పని సక్రమంగా చేయకుండా వుండడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తి తరచూ భార్య,భర్తల మధ్య గొడవలు జరిగేవి. పద్మ డ్వాక్రా గ్రూప్‌లో లోన్ తీసుకుంది. ఆ అప్పు కోసం వత్తిడి పెరగడంతో తీవ్ర మానసిక వేదనకు గురైంది. ఒక వారం క్రితమే శివ శ్రీసిటీలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఈ నేపథ్యంలో శనివారం పద్మ ఇద్దరు పిల్లలను స్కూలు నుంచి ఇంటికి తీసుకుని వచ్చి పిల్లలకు ఉరి వేసి, తాను ఉరి వేసుకుని మృతి చెందింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి వచ్చి శివశంకర్ తలుపులు వేసి వుండడంతో వాటిని విరగ్గొట్టి, లోపలకు వెళ్లి చూడగా భార్య, ఇద్దరు పిల్లలు మృతి చెంది వుండడాన్ని గమనించాడు. స్థానికులు గమనించి 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి చూడగా ముగ్గురు మృతి చెందిన విషయాన్ని ధృవీకరించుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఇకపై నీలాంటి వ్యక్తితో జీవించలేనని పద్మ తన భర్తను ఉద్దేశిస్తూ ఒక సూసైడ్ నోట్ రాసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తల్లి, ఇద్దరు పిల్లల ఫోటోలు (ఫైల్ ఫోటో)

## సచివాలయ ఆరోగ్య కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ పనులు అప్పగింత

– జిల్లా పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ

**చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**



జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ పనులు మాత్రమే చేసేలా ఇది వరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జారీ చేసిన ఆదేశాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ జడ్పీ సిఇఓ రవికుమార్‌ను కలిసి విన్నవించారు. జడ్పీ సిఇఓ ఛాంబర్‌లో జడ్పీ సిఇఓ రవికుమార్‌ను శనివారం జిల్లా పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ కలిశారు. ఈ సందర్భంగా ఆయన జడ్పీ సిఇఓతో మాట్లాడుతూ సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన పనులు మాత్రమే చేసేలా ఎంపిడిఓలు, సెక్రటరీలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంతమంది ఎంపిడిఓలు సచివాలయ ఆరోగ్య కార్యకర్తలను జీతాలు నిలుపుదల చేస్తాం! సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని, జీతాలు ఇస్తున్న తాము చెప్పిన పనులు చేయాలని స్పష్టం చేస్తున్నారని ఆయన జడ్పీ సిఇఓకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన వారిలో పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.శ్రీనివాసమూర్తి, చిత్తూరు తాలుకా ఎన్జీఓ సంఘ అధ్యక్షులు భానుప్రకాష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో చెన్నై హైకోర్టు న్యాయమూర్తి

**కాణిపాకం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**



చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జ్యోతిరామన్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు వందరోజులు పని కల్పించాలి

–డ్వామా పీడీ రవికుమార్



**తవణంపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వందరోజులు పని కలి కల్పించాలని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 18వ విడత సామీజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. డ్వామీ పీడీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యామంలో 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంభందించి సమాజిక తనిఖీ బృందం ఆడిట్ నివేదికనలు అందజేశారు. ఈసందర్బంగా పీడీ మాట్లాడుతూ ఉపాది హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో 817 పనులు జరిగాయని తెలిపారు. ఇందుకోసం మొత్తం 6,32,33,870 రూపాయలను చెల్లించినట్లు తెలిపారు. ఇందులో వేతనాల కింద కూలీలకు 3.55 కోట్లు రూపాయలు చెల్లించగా, మెటీరియల్‌కు 2.77 కోట్లు రూపాయలను చెల్లించినట్లు తెలిపారు. ఈపథకం ద్వారా దురి ్వనియోగం అయిన 44,224 రూపాయలను రికవరి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పథకంకు సంభందించి రికార్డులను సక్రమంగా నిర్వహించని సిబ్బందికి 9వేల రూపాయలను అపరాధ రుసుంగా విధించారు. ఈకార్యక్రమంలో పథకం జిల్లా అంబుడ్స్‌మెన్ వరదరాజులు, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఏపీఓలు బాల, లత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన వారికి ఈ జన్మలోనే శిక్ష

గుడిపాల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంను కల్తీ చేసిన వారికి ఈ జన్మ లోనే శిక్ష పడుతుందని రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రి నాయుడు అన్నారు. గుడిపాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లడ్డూ కల్తీ జరిగిందని చెప్పడానికి ప్రభుత్వం వద్ద కావాల్సిన ఎన్డీడిబి రిపోర్టులు, ఎన్‌డిఆర్‌ఐ రిపోర్టు, సిఎస్‌టిఆర్‌ఐ రిపోర్టు, సిట్ రిపోర్టు సాక్ష్యాలుగా వున్నా యన్నారు. హిందూ భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రను దెబ్బ తీయడానికి వైకాపా నాయకుల ఉద్దేశంగా వుందని స్పష్టం అవుతుందన్నారు. వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వద్ద ఏ రిపోర్ట్ వుందని లడ్డూలో కల్తీ జరుగలేదని చెప్పడానికి అని ఆయన ప్రశ్నించారు. హిందు దేవాలయాలపై కక్ష సాధించడానికే ఇలాంటి చర్యలకు వైకాపా పాల్పడుతుందని ఆయన విమర్శించారు.



## స్మశాన భూమిని అనుభవిస్తున్నది వైసిపి వారే

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త అయ్యవారిపల్లె హరిజనవాడ గ్రామ పరిధిలో గత వందేళ్లుగా కోడూరు రెవెన్యూ సర్వేనెంబర్ 1509 వాగు పొరంబోకు భూమిని స్మశానంగా ఉపయోగించు కుంట ున్నారు. అదే సర్వేనెంబర్ భూమిలో గ్రామ ప్రజలు చదునుచేసుకొని చుట్టూ రాళ్లు పాతుకొని ఆ భూమిలో సమాధిలో వేసుకుంటున్న భూమిని అమ్మింది ఎవరు? కొన్నది ఎవరో? అందులో బోరు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నది ఎవరు? అని రైల్వే కోడూరు జనసేన నాయకులు. మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ బత్తిన గంగయ్య యాదవ్ అన్నారు. ఇటీవల వైసిపికి చెందిన వారు కొంతమంది తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఒకవేళ అదే నిజమని ఆరోప ిస్తే తక్షణమే ఆ భూమిని వదులుకుంటానని వైసిపి వారికి బత్తిన గంగయ్య సవాలు విసిరారు. మా పూర్వీకుల నుండి మా అనుభవంలో ఉన్న కోడూరు సర్వేనెంబర్ 1522 /3.0.30 సెంట్ల భూమిలో 120 సంవత్సరాలు వయసున్న భారీ రావి చెట్టు ఉండేదని ఆ రావి చెట్టు గ్రామస్తుల ప్రజల కొరకే ఉంచామని తెలిపారు.

## బండ్ల గణేష్ పాదయాత్రకు సంఘీభావం

**చిట్వేలి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తెలుగు సినీ నిర్మాత బండ్ల గణేష్ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా హైదరాబాదు నుంచి తిరుమల వరకు తలపెట్టిన మహా సంకల్ప పాదయాత్రకు నియోజకవర్గ నాయకులు సంఘీభావం తెలిపారు. శనివారం రైల్వే కోడూరు నియోజకవర్గం రెడ్డిపల్లి వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, మాజీ తానా అధ్యక్షుడు వేమన సతీష్ ఆధ్వర్యంలో బండ్ల గణేష్ కు సంఘీభావం తెలియపరిచారు. కట్టా గుండయ్య నాయుడు, చప్పిడి బాబు, నరేష్, చిట్వేలి మండల టీడీపీపార్టీఅధ్యక్షులుకాకర్లనాగార్జున, పెనగలూరుమండలంపార్టీ అధ్యక్షులు నారాయణ రెడ్డి, బుంగటావుల రాజశేఖర్, కట్టాగిరిబాబు, కాటూరినరసింహులు, తేనేపల్లిచిన్న, బాలురెడ్డయ్య, దుగ్గినవెంకటయ్య పాల్గున్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా పోలీసు పనితీరు ఉండాలి



**పెనగలూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ఉన్న గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా పోలీసుల పనితీరు ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. శనివారం పెనగలూరు మండల పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ సుబ్బరాయుడు, డిఎస్పీ శ్రీనివాసరావు, రైల్వే కోడూరు రూరల్ సిఐ శ్రీనివాసులు పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని పరిశీలించారు. క్రైం రికార్డు ఎలా ఉందో అడిగి తెలుసు కున్నారు. సిబ్బందికి పలు రకాల సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎసై రఘు రాం, ఓబులవారి పల్లి ఎస్సై మహేష్ నాయుడు, ఎస్సై రాముడు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, టిడిపి నాయకులు ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించుటకు ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలి

పెనగలూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ఉన్న ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం ఊరి బడిని కాపాడుకుందాం అన్న నినాదంతో యుటిఎఫ్‌చే రూపొందించిన గోడపత్రిక ఆవిష్కరణను మండల విద్యాశాఖ అధికారులు యం. గిరి వరదయ్య, టి. నాగసుబ్బరాయుడు ఊరి బడిని కాపాడుకుంటేనే పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుతుందని, లేకపోతే పేదలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఇప్పటినుంచే గ్రామాల్లో తల్లిదండ్రులను సందర్శించి పిల్లలను చేర్పించమని కోరాలని, వారి విద్య పట్ల భరోసా కల్పించి ఊరి బడి పట్ల ఆకర్షితులయ్యేలా ఒప్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల విద్యాసామాగ్రిని ఉచితంగా అందజేయడంతో పాటు, నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజన సదుపాయం, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన ఐ.ఎఫ్.పి ప్యానెల్ బోర్డులు, ఎల్ఈడి టీవీల సహాయంతో విద్యాబోధన సాగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి. హరి ప్రసాద్, మండల అధ్యక్షులు పి. శ్రీనివాస్ కుమార్, సహాధ్యక్షురాలు జి. వాణి, ట్రెజరర్ యస్. నజీమ్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జె. సురేంద్ర, మహిళా కమిటీ కన్వీనర్ డి. పద్మశ్రీ, కెజిబివి ప్రిన్సిపల్ సుచరిత, వెంకటేశ్వర్లు, కిషోర్, గిరి, రామ క్రిష్ణయ్య, రాజేశ్వరమ్మ, సుజాత, ఉమాదేవి, మురళి క్రిష్ణ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:




విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని పెద్దపంజాణి ఎస్సై మారెప్ప సూచించారు. శనివారం ఎస్సై మారెప్ప స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్ వ్యతిరేక అవగాహన సదస్సు ను, ర్యాలీని నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలమేరకు కష్టపడి బాగాచదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలి

– కెఐసి వైస్‌చైర్మన్ డా॥ సునీల్ రాజ్

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా మక్కువ చూపాలని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌చైర్మన్ డా॥ సునీల్ రాజ్ సూచించారు. శనివారం కళాశాలలో క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్‌ను స్వీకరించి అభివందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉల్లాసం కలిగించడంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇండోర్, ఔట్‌డోర్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులు, అధ్యాపకులకు వైస్ చైర్మన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ స ందర్భంగా విద్యార్థులు చేపట్టిన టార్చ్‌రన్ అలరించింది. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, పిడి సతీష్, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరమహంస యోగానందలో ఘనంగా వీడ్కోలు సమావేశం

శాంతిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘన ంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, వైస్ ప్రిన్సిపాల్ పారి ్వతులు, షమీమ్, అక్షత, నారాయణరెడ్డి, ప్రతాప్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలు, బాధ్యతలు తెలుసుకుని నడుచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా మారాలని సూచించారు. ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. అంతకుముందు సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాడి రైతులకు అవగాహన శిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మండలంలోని ఆవులకుప్పం గ్రామంలో పాడి రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పాడి ఆవులకు సంక్రమించే వ్యాధులు, నివారణ గురించి వివరించారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు సతీష్‌బాబు, జయశ్రీ, కాలేషా, టిడిపి ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, సుబ్రమణ్యం నాయుడు, నాగరాజు, బాలాజీ, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు

–టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య పిలుపు

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా వుండి భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య పిలుపు నిచ్చారు. చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో మత్తు పదర్థాలకు అలవాటు పడితే దాని నుండి బయటపడటం కష్టమవుతుందని, చివరికి నేరాల వైపు దారి తీస్తారన్నారు. విద్యార్థులకు మత్తు పదర్థాలకు నో చెప్పి ఆరోగ్యకర జీవితానికి ఎస్ చెప్పాలన్నారు. అలాగే మహిళలు, బాలికలు, పిల్లలపై నేరాలు చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, దీనికి సంబంధించి శిక్షలు సైతం తీవ్రంగా వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వవిప్‌చే మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

గుడుపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మండలంలోని మల్లప్పకొండపై వెలసిన శ్రీ స్వర్ణగిరి మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను శనివారం ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14-16 తేదీల మధ్య నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అన్ని చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, పట్టుబోర్డు సభ్యుడు హేమా ంబరగౌడ, స్థానిక నేతలు పాల్గొన్నారు.




## జిల్లా ఎస్పీని సత్కరించిన కాకర్ల.

**చిట్వేలి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** స్థానిక చిట్వేలి పోలీస్ స్టేషన్ ను తొలిసారిగా సందర్శించిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును మండల టిడిపి నూతన అధ్యక్షుడు కాకర్ల నాగార్జున పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మీకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పి సుబ్బరాయుడు తనకు సూచించినట్లు కాకర్ల నాగార్జున తెలిపారు.

## పుల్లంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



**పుల్లంపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు శనివారం మొట్టమొదటిసారిగా పుల్లంపేట పోలీస్ స్టేషన్ వచ్చి పరిశీలించారు ఇటీవల రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లా నుంచి తిరుపతి జిల్లాకి మార్చినందున పుల్లంపేట పోలీస్ స్టేషన్ కు వచ్చి స్థానిక ఎస్ఐ చిన్న రెడ్డప్పను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుల్లంపేట కేంద్రంగా నూతనంగా సిఐ కార్యాలయం కూడా ఏర్పాటు చేయనున్నారు ఇందుకుగాను గతంలో ఎస్ఐ కు కేటాయించిన కోటర్స్ ను సీఐ కార్యాలయానికి ఉపయోగించమన్నారు. పుల్లంపేట పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కు పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు రైల్వే కోడూరు సిఐ శ్రీనివాసులు ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు పెనగలూరు ఎస్ఐ రఘురాం చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్ స్థానిక ఎస్సై చిన్నారెడ్డప్ప టిడిపి నాయకులు పోలూరు కృష్ణమ నాయుడు ముద్దా సుభాష్ రెడ్డి కేశినేని నారాయణ నాయుడు బోడ వెంకటరమణ నూకల శరణం సుబ్బారెడ్డి అనపాల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ వ్యవసాయంపై రైతులకు అవగాహన.

చిట్వేలి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:



వ్యవసాయ సాగులో ఆధునిక యంత్రాల వినియోగంపై శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ అధ్యక్షతన రైతులకు, యంత్రాల సరఫరా దారులకు డిజిటల్ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే కోడూరు వ్యవసాయ సంచాలకులు ఎస్ మణి విచ్చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ అప్లికేషన్ ద్వారా తమకు కావలసిన వ్యవసాయ యంత్రాలు అద్దెకు క్యాబ్ తరహాలో వ్యవసాయ యంత్ర సేవలు రైతులు సులువుగా, త్వరగా, తక్కువ ధరకు పొందవచ్చున్నారు. తద్వారా రైతులకి సమయం, కూలీల ఆదా జరుగుతుందన్నారు. ప్రతి రైతు apaims 2.0 app ను ప్లేస్టోర్ ద్వారా ఇన్స్టాల్ చేసుకొనిలో రైతులు తమ మొబైల్ నెంబర్ తో ఓటిపి ద్వారా లాగిన్ అయ్యి అందుబాటులో ఉన్న యంత్రాలని అద్దెకు పొందవచ్చునని తెలిపారు.. రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖలు రైతులందరికి ఈ అప్లికేషన్ మీద పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం డ్రోన్స్, ట్రాక్టర్లు, హార్వెస్టర్ లు, బెలర్స్ అప్లికేషన్ ద్వారా అద్దెకు అవకాశం కల్పించడం జరిగిందని, కొన్ని రోజుల్లో ఇతర యంత్రాలు కూడా అప్లికేషన్ లో అందుబాటులో వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం యంత్ర పరికరాల యజమానులు, సిహెచ్ సి సభ్యులు, రైతులు, ఆర్ బి కే సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మంత్రి లోకేష్‌ను కలిసిన నేత్ర గణిత అవధాన విద్యార్థులు

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



తుమ్మింద ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను గణిత అవధాని హెచ్ అరుణశివప్రసాద్‌లో కలసి విజయవాడలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసారు. మంత్రికి నేత్రావధానం, గణిత అవధానాల సమ్మేళనంతో నేత్ర గణిత అవధానం చేస్తున్న శర్వాన్, చాముండి, జ్ఞానప్రియల ప్రతిభను అరుణశివప్రసాద్ వివరించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గణిత అవధాని అరుణశివప్రసాద్‌ను మంత్రి అభినందించారు. మంత్రి కలిసిన వారిలో జనవిజ్ఞాన వేదిక నాయకులు జయంతి, సుధాకర్, గణిత ఫోరం రాష్ట్రనాయకులు మల్లికార్జునరెడ్డి, చంద్రమనాయుడు, చిత్తూరుజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ తదితరులు వున్నారు.

## వేణుమాధవునికి పంచామృతాభిషేకం

చౌడేపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామికి పంచామృతాభిషేకానికి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు, వేదపండితుల సమక్షంలో అలయం నందు పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామిలను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## రాజనాలబండ సత్యదేవునికి విశేష పూజలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానార్చకుడు కృష్ణమూర్తిచే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్లారు. టిటిడి ఇన్స్పెక్టర్ భానుప్రకాష్, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ప్రసన్న ఆంజనేయస్వామికి వెండి గొలుసు బహూకరణ

చౌడేపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామికి వెండి గొలుసును బహూకరించారు. సోమల మండలం నంజంపేటకు చెందిన రామచంద్ర, కృష్ణమ్మ దంపతులు స్వామి వారి ఆలయంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తికి రూ. 25వేలు విలువ చేయు వెండి గొలుసునందించారు. టిటిడి సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## జిడి నెల్లూరు సిఐగా బాధ్యతలు చేపట్టిన డి.ప్రసాద్

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



గంగాధర నెల్లూరు అప్‌గ్రేడ్ సిఐగా డి.ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన గంగవరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నిత్యబాబు చిత్తూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నైట్ బీట్లు, హెల్మెట్ ధారణ, మైనర్ పిల్లల డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, శాతిభద్రతల పరిరక్షణ నియంత్రణతో పాటు ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు గుడ్ టచ్ బిడ్ టచ్‌ను ప్రజల్లో సమర్థవంతంగా అవగాహనను కల్పించడానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు మురళీ ప్రసాద్ దామోదరం హెడ్ కానిస్టేబుల్ మని, రెడ్డెప్ప కానిస్టేబుల్‌లు వెంకటేష్, కిషోర్‌లు పాల్గొన్నారు.

## బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోతే చెరువుల్లో వేయరాదు: ఎంపిపి



**రొంపిచెర్ల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త** మండలంలోని ప్రజలకు యూరియా కొరత లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఎంపిపి చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సచివాలయ ఉద్యోగులతో రైతులకు యూరియాను పంపిణీ చేశారన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే ప్రస్తుతం కూటమి నాయకులు రైతులకు ఇవ్వాల్సిన యూరియా కూడా వారికి అందించడం లేదన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారయిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పేదలైన చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క రైతుకు తప్పనిసరిగా యూరియా అందించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోతున్నాయని అన్నారు. కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లను సమీపంలోని చెరువులలో వేస్తున్నారని అన్నారు. అలా చెరువులో వేయకుండా కోళ్ల ఫారం యజమానులకు పంచాయతీ కార్యదర్శులు తెలియజేయాలని కోరారు. అలాగే తహసీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో బండకింద పల్లి గ్రామపంచాయతీలో రీసర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. బడవళ్ళ వంక ప్రాజెక్టు రైతులకు నష్టపరిహారం ఇంకా అందలేదని, రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే పీలేరు ఆర్టీసీ శాఖ సిబ్బందితో మాట్లాడుతూ ఆర్టీసీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న డ్రైవర్లు, కండెక్టర్లు ప్రయాణికులను గౌరవించాలని కోరారు. కండెక్టర్లు ప్రయాణికులకు మర్యాద ఇవ్వడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంఈవో శ్రీనివాసులు, ఏపీవో బాలమురళి, ఎస్ఐ మధుసూదన్, ప్రభుత్వ ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ వినయ్, పశువైద్యాధికారి డాక్టర్ ఉష, హార్టికల్చర్ ఏవో సంతోషి కుమారి, ఏఈవో ఖాదర్ వల్లి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ యోగానంద్, ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



రెవిన్యూ సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు, వీఆర్ఏలు కృషి చేయాలని తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం రైతులు భూములను నోషనల్ ఖాతా నుండి రెగ్యులర్ ఖాతాలోకి మార్చుకు నేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. అలాగే సర్వే నెంబర్లు మార్పు, సర్వే నెంబర్లలో గల విస్తీర్ణం మార్పులను చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఏవైనా భూ సమస్యలు ఉంటే నేరుగా రికార్డులను తీసుకొని వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**పెద్దపంజాణి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**



పురుషులతో సమానంగా మహిళలు పారిశ్రామికంగా ఎదగాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి సూచించారు. శనివారం పెద్దపంజాణి మండలంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం రాయితీతో అందించిన ఈ సైకిళ్ళను ఆయన పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వమైనా ఎక్కువకాలం కొనసాగితేనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమౌతుందని పేర్కొన్నారు. ప్రజలు, మహిళలు వచ్చే ఎన్నికల్లో కూడా కూటమిప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామ్మూర్తి, ఎంపిడీఓ బాలాజీ, ఏపీఎం మీరాబాయ్, నాయకులు విజయ్‌భాస్కర్ రెడ్డి, ఆనంద, చలపతి, రుద్రమూర్తి నాయుడు, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజారెడ్డి, క్రిష్టారెడ్డి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి మండలంలోని పెద్దారికుంట గ్రామానికి చెందిన చిన్న రెడ్డెప్ప రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో గ్రామానికి చేరుకుని మృతదేహానికి స్థానిక నేతలతో కలసి ఘన నివాళులర్పించారు. అలాగే నాలుగు నెలలక్రితం ప్రమాదవశాత్తు మృతిచెందిన టిడిపి కార్యకర్త బెరబల్లి రామస్వామి కుటుంబానికి బీమాపథకంకింద 5లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి పంపిణీచేశారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం

వెంకటగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

ఈనెల 12వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు కార్యాలయం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వివి రమణయ్య మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, విశాఖ ఉక్కుతో సహ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం



చేయాలని వెంకటగిరిలోని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాలరాస్తూ, ఉద్యోగ భద్రతను పూర్తిగా నాశనం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. కనీస వేతనం రూ. 30,000 చెల్లించాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఆర్పీ తదితర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. 200 రోజులు పని కల్పించాలని సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం నాయకులు మీనా, రైతు కూలీ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, వీధి విక్రయ దారుల సంఘం నాయకులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు ప్రసాద్, పెంచలయ్య, పోలయ్య, రమణయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## భక్తిశ్రద్ధలతో మహా యజ్ఞం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన మహా యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రారంభమైన యజ్ఞం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. చెన్నూరు రామసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుమన్‌రెడ్డి ఈ యజ్ఞానికి ఉభయ కర్తగా వ్యవహరించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇఓ కొడిముడి మమత, అయితా శ్రీధర్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి శనివారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ స్థితిగతులను జగన్‌మోహన్‌రెడ్డి శ్రీమంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి దబ్బల శ్రీమంత్‌రెడ్డి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యంతో పార్టీకోసం కష్టపడి పనిచేసి పూర్వవైభవం కోసం కృషి చేయాలని సూచించారు.

## లోకేష్‌ని కలిసిన ఎంఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సూళ్లూరుపేట ఎంఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు వెంకటగిరి పట్టణంలో పార్టీ పరిశీలకులుగా పనిచేసిన ఆకుతోట రమేష్ తన నివేదికను పార్టీ అధిష్టానానికి అందజేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌ను కలిశారు. పార్టీని బలోపేతం చేసి మరింతగా స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని లోకేష్ సూచించారు.

## జెసిబి దగ్ధం

పెళ్లకూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

మండలంలోని పెళ్లకూరు పంచాయతీకి చెందిన రాణిగారి తోటభూముల్లో జెసిబి దగ్ధమైంది. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని రాణిగారి తోట గోపాల్‌రెడ్డికి చెందిన భూముల్లో సవక చెట్లను తొలగించే పనిలో జెసిబి పని చేస్తుండగా విస్టర్ సీల్ లీక్ అవడంతో జెసిబిని అక్కడే ఉంచి సోమవారం ఉదయం వెళ్లి చూడగా మొత్తం కాలిపోయి ఉండడంతో అనుమానం వచ్చిన జెసిబి యజమాని కృష్ణ కిషోర్ రెడ్డి పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో పోలీసులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు.

## పేట విద్య కేంద్ర స్కూల్లో 14వ వార్షికోత్సవం





నాయుడుపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

నాయుడుపేట రాజగోపాలపురంలో ఉన్న విద్య కేంద్ర స్కూలు 14వ వార్షికోత్సవం కేకే కళ్యాణ్ సదన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు ఉద్దేశించి నాయుడుపేట మాజీ ఏఎంసి చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఒక ధ్యేయంతో పట్టుదలతో తల్లిదండ్రులకు, సమాజ సేవకు, ఉపయోగపడే విధంగా మీరు ఇష్టపడి ఎన్నుకున్న సబ్జెక్టు పై పట్టు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. అనంతరం నాయుడుపేట రూరల్, అర్బన్ సీఐ సంగమేశ్వర రావు మాట్లాడుతూ కష్టే ఫలి అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు నేడు ఉన్న సాంకేతికతను వినియోగించుకొని ఇష్టపడి చదివితేనే అనుకున్న గమ్యం చేరగలరని విద్యార్థులతో అన్నారు. అనంతరం కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు సంబంధించి పలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సూచనలు అందించారు. ప్రముఖ పాఠశాలగా ఉన్న విద్య కేంద్ర విద్యార్థులు అయిన టి వెంకటాద్రి, నవీన్ కుమార్, ఎల్ లహరి, అత్యధిక మార్కులు సాధించి పట్టణంలోని ఇతర స్కూల్స్ కు తీసిపోని విధంగా వీరికి బహుమతులు ప్రధానం ముఖ్య అతిథులచే కావించారు. వివిధ రకాల ఆటల పోటీలలో సాంస్కృతిక కార్యక్రమాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కరస్పాండెంట్ శ్రీనివాసులు, రామిరెడ్డిలతో పాటు సురేష్ రెడ్డి, జమీల దేవి, విజయ, శ్రీనివాసులు, ఉష, విజేత, మణికంత తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో రసీదులు తప్పనిసరిగా ప్రజలకు ఇవ్వండి

### - తహసీల్దార్ సుధీర్ రెడ్డి, డీవీఎంసి మెంబెర్ గుత్తి త్యాగరాజు

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా చేరాలంటే క్షేత్రస్థాయిలో పారదర్శకత అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో ప్రతి రేషన్ దుకాణదారు లబ్ధిదారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తహసీల్దార్ సుధీర్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడం తెలిపారు. రేషన్ తీసుకున్న ప్రతిసారి రసీదు అందినప్పుడే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ఎంత, ఏ విధంగా లబ్ధిదారుడికి చేరుతుందో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. రసీదు అనేది కేవలం కాగితం కాదు అది లబ్ధిదారుడి హక్కుకు ఆధారం, ప్రభుత్వ సంక్షేమానికి అద్దం లాంటిదని అన్నారు. ఒక ఇంటిలో నలుగురు ఉంటే ఆ ఇంటికి నెలకు 834/రూపాయలు విలువైన బియ్యం అందుతుందని అన్నారు. రేషన్ వ్యవస్థలో ఎక్కడైనా లోపాలు ఉంటే అవి ప్రజలకు తెలిసేందుకు రసీదు విధానం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఏదైనా పిర్యాదులు ఉంటే 1967 నెంబర్‌కు తెలియజేయవచ్చని అన్నారు. ప్రభుత్వం - అధికారి - ప్రజలు ఈ ముగ్గురి మధ్య నమ్మకానికి పునాది వేయగల సాధనం రేషన్ రసీదు అనే విషయం మరువకూడదని గుత్తి త్యాగరాజు అన్నారు.

## కావేరి గ్రూపులో 4 లక్షల స్వాహా!

### పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కేవీబీపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

మండలంలోని వగత్తూరు గ్రామ పంచాయతీ పొగత్తూరు దళితవాడలో 12 మంది మహిళలు సభ్యులుగా చేరి గత 30 సంవత్సరాలుగా వెలుగు సంఘాన్ని సక్రమంగా నడుపుకుంటున్నారు. సంగం మొదటి లీడరుగా ఎన్.కాటమ్మ, టి.వల్లమ్మ సంఘాన్ని నిర్వహిస్తున్నారు. సంఘానికి అదే ఒక వగత్తూరు దళితవాడకి చెందిన ఆర్.మునెమ్మ ఆ సంఘం లెక్కలు చూసేది. గతంలో కేవీబీ పురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో లక్షలాది రూపాయలు రుణం తీసుకున్నారు. నాలుగు నెలల క్రితం పూర్తిగా వడ్డీ, అసలు చెల్లించారు. కానీ సంఘమిత్ర పని చేస్తున్న మునెమ్మ సుమారు 4 లక్షలను చెల్లించుకుని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో చెల్లించలేదు, కానీ సీసీ చంద్రకళ సహాయంతో రాజుల కండ్రిగ స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకులో రుణాలను తీసిచ్చారు. కానీ సంఘ సభ్యులు చెల్లించిన అసలు వడ్డీని కేవీబీ పురం గ్రామీణ బ్యాంకులో చెల్లించలేదు. ఈ విషయాన్ని పసిగట్టిన సంఘ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 4 లక్షలను సీసీ దగ్గర ఇచ్చానని ఆమె తినేసిందని సంఘమిత్ర మునెమ్మ, సి.చంద్రకళపైన తెలపగా సంఘమిత్ర మునెమ్మ కార్యాలయంలో గొడవ పడ్డారు. సంఘమిత్ర ఏపీఎంను వివరణ కోరగా నేను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని, సంఘ సభ్యులు ఎవరు కూడా బ్యాంకులో నేరుగా కట్టాల్సిందేనని మేటు ఎవరు సంఘం ఇవ్వకూడదని ఇంద్రాణమ్మ తెలిపారు.

## లోబావిలో చేపలు చనిపోతున్నాయి!



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న లోబావిలో చేపలు చనిపోతున్నాయి. కారణం ఏమిటో? తెలియదు కానీ రెండు రోజులుగా కుప్పలు తెప్పలుగా చేపలు చనిపోతున్నా ఇక్కడ పర్యవేక్షించే దేవస్థానం ఉద్యోగులు స్పందించటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. శానిటరీ విభాగంలో లెక్కలేనంత మంది సిబ్బంది ఉన్నారు. పర్యవేక్షకులున్నారు. కానీ చేపలు చనిపోతున్న విషయం ఇప్పటి వరకు అధికారులకు తెలియదు. ఇక్కడ చేపలు భక్తులు వచ్చి ఆహారం వేసినపుడు పైకి రావటం పిల్లలకు ఆహ్లాదంగా ఉండేది. కానీ రెండు రోజులుగా చేపలు చనిపోతుండంతో వేకువ జామున ఇక్కడ వాకింగ్‌కు వెళ్ల వాకర్లు దుర్గంధం భరించలేక పోతున్నారు. అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

## అల్లాహ్ అందించిన దివ్యగ్రంథం పఠనం సకల శుభాలకు సూచకం

### మహమ్మది ఇలియాస్ సాహెబ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



సృష్టిని మనుషులను సృష్టించిన దయాళువు సరాసరి అందించిన దివ్యగ్రంథం 'ఖుర్‌ఆన్' అని దానిని ప్రతి ఒక్కరు పఠించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెల్లూరుజిల్లాకు చెందిన మత గురువు మహమ్మద్ ఇలియాస్ సాహెబ్ అన్నారు. శనివారం జామియా మస్జిద్‌లోని అరబ్బి పాఠశాలలో రెండేళ్ళ పాటు కఠోర దీక్షతో అతి చిన్నవయస్సుల్లో కంఠస్థం చేసిన చిన్నారులకు పట్టా అందించుటకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు శిక్షణ ఇచ్చిన గురువు హాఫీజే ఖుర్‌ఆన్ రేహన్ సాహెబ్ అధ్యక్షతన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఇలియాస్ సాహెబ్ మాట్లాడుతూ ఇంటింటిలో ఖుర్ పఠనం జరగాలన్నారు. ముఖ్యంగా మహిళలు పఠించి అర్థం తెలుసుకొని అల్లాహ్ ఆదేశాలను ఆచరిస్తూ జీవనం గడిపి సుఖ సంతోషాలు పొందాలన్నారు. మనం అల్లాహ్ ఆదేశాలను పాటించనందువల్లే ఎన్నో అనర్థాలను ఎదుర్కొంటున్నామని ఇలియాస్ సాహెబ్ అన్నారు.

**అతి చిన్నవయస్సులో . . .**

శ్రీకాళహస్తిలో సంప్రదాయ విద్యకు ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సామాజిక విద్యతో పాటు సంప్రదాయ విద్యపై కూడా దృష్టి సారించి తమ పిల్లలను తీరిక సమయాల్లో మదరసాలకు పంపటం హర్షణీయం అన్నారు. నేడు అతి చిన్నవయస్సులో 666 పేజీల దివ్యఖుర్‌ను కంఠస్థం చేయటం అభినందనీయం అని ఆశీర్వదించారు. ఈ నేపథ్యంలో షేక్ ఫర్హాన్(11), అబూబర్ (13), హుజైఫాలు హాఫీజులు కావటం గమనిస్తే వారి కఠోర దీక్షను అభినందించాల్సిందే అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా ముఫ్తీ నయిం సాహెబ్, హాఫీజే ఖుర్‌ఆన్ నసీం అఖ్తర్‌సాహెబ్, మహమ్మద్ అలి, మౌలానా మహబూబ్‌బాషాలతో పాటు పట్టణ ప్రముఖులు, మసీదు కమిటి నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎనర్జీ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శి ఆధీనంలో పనిచేయాలి : ఎంపిడిఓ

వాకాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని సచివాలయంలోని పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో పనిచేయాలని ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి సర్వేలో ఎనర్జీ అసిస్టెంట్లు సకాలంలో పనిచేయున వల్ల ఐదు మంది ఎనర్జీ అసిస్టెంట్లకు మెమోలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామంలో అన్ని విద్యుత్ దీపాలకు సంబంధించి సచివాలయంలోని అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అనుమతితోనే బయటికి వెళ్లి వలసి ఉన్నదని, బయటకు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో సంతకం చేసి ఇన్ టైం అండ్ అవుట్ టైం వ్రాసి వెళ్లాలన్నారు. సచివాలయంలోని పనిచేస్తున్న ప్రతినెల ఎనర్జీ అసిస్టెంట్లకి పంచాయితీ కార్యదర్శి డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తేనే ట్రాన్స్కో ఏఈ జీతం డ్రా చేసి ఇవ్వాలని అన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లకు అత్యవసరమైన సమయంలో సెలవులు ఇచ్చే అధికారం పంచాయతీ కార్యదర్శికే ఉందని ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయం పనిచేస్తున్న ఎనర్జీస్టెంట్లు తప్పనిసరిగా సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏవో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు : కంచర్ల

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

పేద ప్రజల ఆరోగ్యం కోసమే సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా సంజీవని (టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్) ప్రాజెక్టును అమలు చేస్తున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కడ కార్యాలయంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై జరిగిన సమీక్షా సమావేశంలో డా॥ శ్రీకాంత్ ప్రసంగించారు. కుప్పంలోని ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని పిహెచ్‌సిలు, సబ్ సెంటర్ల పరిధిలో సంజీవని సేవలు అందుబాటులో తెచ్చారన్నారు. ఒక వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించి అతనికి ఓ ఐడి ఇవ్వడంతో పాటు అతని ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ రూపంలో భద్రపరచడం జరుగుతుందన్నారు. ఎప్పుడైనా అత్యవసర వేళల్లో ఎవరికైనా అత్యవసర వైద్యం అవసరమైతే ఈ రికార్డుల ద్వారా ఆ వ్యక్తికి బయటి ప్రాంతాల్లోని వైద్య నిపుణుల సూచనల మేరకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ వివరాలు కేంద్ర ప్రభుత్వం యొక్క అభ కార్డుల్లో సైతం పొందుపరచడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకుఈ ప్రాజెక్టుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో అమలయ్యే ఈ ప్రాజెక్టు త్వరలోనే సిఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారన్నారు. ఇది ఓ గేమ్‌ఛే ంజర్ ప్రాజెక్టు అన్నారు. సమావేశంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, వెంకీ, జనసేన కోఆర్డినేటర్ నరేష్, అధికారులు పాల్గొన్నారు.

## స్ఫూర్తితో విధులు నిర్వహణ

### - డిఆర్‌డిఎ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసిన కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది స్ఫూర్తితో విధులు నిర్వర్తించి సాంఘీక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ కుప్పం పట్టణంను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఎక్కించేలా 24 గంటల వ్యవధిలో 5,555 ఈ-సైకిళ్ళను పంపిణీ చేసిన డిఆర్‌డిఎ సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ డిఆర్‌డిఎ, డ్వామా సిబ్బంది సాంఘీక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈమోటూ రాడ్స్ పరిశ్రమ ఒప్పందం మేరకు కుప్పం ప్రాంతంలో ఈ-సైకిల్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ-సైకిళ్ళను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడం గర్వకారణంగా వుందన్నారు. ప్రజలకు పర్యావరణ రహిత రవాణా వాహనాలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందన్నారు. అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేయడంతోనే ఈ అరుదైన రికార్డు సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛంద కార్యక్రమాలు, ముస్తాబు కార్యక్రమాలు, మహిళల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అందరు కలసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిఆర్‌డిఎ సిబ్బంది, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్నత హోదాల్లో ఉన్న వ్యక్తులు ఉపాధ్యాయుల చేతిలో రూపుదిద్దుకున్నవారే

### -పద్మావతి వర్సిటీలో డాక్టర్ డికె చతుర్వేది





యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 7ప్రభాతవార్త:

సమాజంలో ఉన్నత హోదాల్లో ఉన్న వ్యక్తులందరూ ఉపాధ్యా యుల చేతిలో రూపుదిద్దుకు న్నారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ,ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపుకు ఈ సదస్సు వినియోగపడుతుందని ఎన్‌సిటిఈ అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ డికె చతుర్వేది తెలిపారు. 21వ శతాబ్ధపు ఉపాధ్యాయుని యొక్క ముఖ్యవిధి, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేకతను గుర్తించాలన్నారు. వారిని ప్రోత్సహించడం ద్వారా ఉపాధ్యాయ సాంకేతికతతో కూడిన విద్యాబోధన నైపుణ్యాలు, వృత్తిప్రమాణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని తెలిపారు. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ నేషన్ వైడ్ రూల్ అవుట్ ఆఫ్ ఎన్‌పిఎస్‌టి ,ఎన్ఎంఎం" అనే అంశంపై సదస్సులో శనివారం ముఖ్యఅతిధిగా చతుర్వేది పాల్గొన్నారు. పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, ఎన్ఎంఎం అమలు కమిటీ సభ్యుడు జ్ఞానేంద్రకుమార్, డిఈఓ కెవిఎన్ కుమార్ డిజిటల్ పోర్టల్ వినియోగంపై వివరించారు.

## పట్టణ అధ్యక్షుడు రఫీ ఆధ్వర్యంలో విరాళాల వెల్లువ



నాయుడుపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని సిఎస్ తేజ కూడలిలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు. మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ ఆధ్వర్యంలో నట సామ్రాట్, విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు విరాళాలు అందజేస్తున్నారు. శనివారం స్థానిక సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ అభ్యర్థన మేరకు ఆమె సమక్షంలో దొరవారిసత్రం తెలుగుదేశం పార్టీ నాయకులు నెలబల్లి రాజేంద్ర పట్టణ అధ్యక్షుడు 786 రఫీకి లక్ష రూపాయలు స్టీల్ వర్క్‌కి సంబంధించి విరాళం అందించారు. నియోజకవర్గం స్థాయిలో ఎన్టీఆర్ సేవలను గుర్తించే విధంగా విగ్రహాన్ని తనదైన శైలిలో 786 రఫీ కృషితో పట్టుదలతో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని నాయుడుపేటలో ప్రతిష్టించడం నాకు పూర్వజన్మ సుకృతం అని అన్నారు. త్వరలోనే భారీ ఎత్తున ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఫీలతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం నిందితుల అరెస్టు

వెంకటగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద లక్ష పదివేల రూపాయల విలువ కలిగిన 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెనుబర్తి గణేష్ గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు చెప్పారు. మూడు సెల్ ఫోన్లు కూడా వీరి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయిపై గట్టిగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరైనా గంజాయి ఎక్కడ ఇస్తున్న, స్మగ్లింగ్ చేస్తున్న సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిఐ ఏవి రమణ, ఎస్సై ఏడుకొండలు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

వెంకటగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

మద్యం సేవించి డ్రైవ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు 16 మందికి 2,30,000ఆటోకు 25 వేల రూపాయలు జరిమానా విధించిన జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ. నాలుగు ద్విచక్ర వాహనదారులకు 10000 రూపాయలు జరిమానా, 11 ద్విచక్ర వాహనదారులకు 15 వేల రూపాయలు జరిమానాను విధించారు. డక్కిలి ఎస్సై శివశంకర్ అరెస్ట్ చేసి డ్రైవర్లను కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా మద్యం సేవించి హైవేలపై ప్రయాణం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఘనంగా ముద్దుకృష్ణమ వర్ధంతి

పుత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :



దివంగత మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు 8వ వర్ధంతిని పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వందలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి తన తండ్రి రాత్రింబవళ్లు పనిచేశారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవ చేయడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, రాష్ట్ర వన్నుకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, పార్టీ పట్టణ, రూరల్ విభాగాల అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ఎ.బాలాజీ, ప్రధాన కార్యదర్శులు ఎన్.ఎన్.ధనపాల్, వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చిన చంద్రబాబు

### వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు భూమన

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని సాక్షాత్తు శ్రీవెంకటేశ్వరస్వామికి శత్రువుగా చిత్రీకరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని, శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చుతున్నారనీ ఉమ్మడి చిత్తూరు జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. శనివారం చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ పార్టీ నాయకుల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంను కన్వీనర్ ఎంసి విజయానందరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసారు. ముందుగా సమావేశానికి హాజరైన నియోజకవర్గ కన్వీనర్ ఎంసి విజయానందరెడ్డి, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖరరెడ్డి, సిపాయి సుబ్రమణ్యంలతో కలసి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తమ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేస్తున్న పోరాటాలను ఎదుర్కొనే దమ్ములేక కూటమినాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారనీ ఆరోపించారు. పవిత్రమైన తిరుమల లడ్డులో జంతువుల కొవ్వు కలిసిందని అసత్యపు ప్రచారాలకు తెరదీశారనీ, పది రోజుల క్రితం తిరుమల లడ్డు ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వులేదని సిట్ నివేదిక ఇచ్చినప్పటికీ చంద్రబాబునాయుడుతో సహా ఆయన మంత్రివర్గంలోని కొంతమంది తమ అనుకూల మీడియా ద్వారా పదేపదే అసత్యపు ప్రచారం నిర్వహిస్తు ఆ దేవదేవుడు వెంకటేశ్వరస్వామికి జగన్మోహనరెడ్డి ప్రధానశత్రువు అనే విధంగా చిత్రీకరిస్తున్నారనీ ధ్వజమెత్తారు. టిడిపి నాయకులకు దమ్ముంటే 2014నుంచి 19 వరకు జరిగిన లడ్డుతయారీ మీద విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేసారు. జిల్లా కేంద్రంలో అధికారపార్టీ నాయకుల, పోలీసుల బెదిరింపులకు ఏమాత్రం బెదరక ధీటుగా విజయానందరెడ్డి నిలబడ్డారనీ, ఎటువంటి కష్టం వచ్చినా పార్టీకి అండగా కార్యకర్తలకు మద్దతుగా వుంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరుపార్లమెంటు మాజీ సభ్యులు రెడ్డెప్ప, రాష్ట్ర మొదలియార్ సంఘ అధ్యక్షులు జ్ఞానజగదీష్, నగర డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.